# రాష్ట్రస్థాయి ఎనర్జీ కన్జర్వేషన్ షార్ట్ వీడియో కాంపిటీషన్ నందు గురురాజా విద్యార్థుల ప్రభంజనం..!

**ద్వితీయ బహుమతి సాధించిన**

**గురురాజా విదార్థులను అభినందించిన డీఈఓ జనార్ధన్ రెడ్డి.**

**శ్రీ గురురాజాపాఠశాల డైరెక్టర్ షేక్షవలి రెడ్డి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 6:** రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఎనర్జీ కన్జర్వేషన్ వీడియో కాంపిటీషన్ నందు శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించగా వారిని నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు వచ్చిన డీఈవో విద్యార్థులను రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులను సత్కరించారు. ఈ విజయంపై పాఠశాల డైరెక్టర్ షేక్షవలి రెడ్డితో చర్చించారు. గత మూడు సంవత్సరాల నుండి వరుసగా రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించిన ఏకైక పాఠశాలగా శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ చరిత్ర సృష్టించిందనీ డెరైక్టర్ షేక్షవలి రెడ్డి డీఈవోకు తెలియజేసారు. ఈ సందర్భంగా డిఇఓ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎనర్జీ సంరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందిస్తూ సమాజానికి సందేశం ఇచ్చే వినూత్న ఆలోచనలతో రూపొందించిన వీడియో అద్భుతమని, విద్యార్థుల శాస్త్రీయ విజ్ఞానాన్ని అభినందించారు. గురు రాజా పాఠశాల యాజమాన్యం విద్యార్థులను విద్యారంగంలోనే కాకుండా సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణలో కూడా ముందంజలో నిలుస్తూ భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని వారు ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విజయానికి ఆధునిక టెక్నాలతో కూడిన విధివిధానాలతో చక్కని శిక్షణ అందించిన ఉపాధ్యాయ బృందానికి స్కూల్ డైరెక్టర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# గర్భాశయ ముఖ క్యాన్సర్ నివారణ పరీక్ష శిబిరాలు ప్రారంభం.

**నంద్యాల ఐఎంఏ మహిళా వైద్య విభాగం నిర్వహణ.**

**ప్రారంభించిన మహిళా వైద్య విభాగం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మాధవి, డాక్టర్ సునీత, డాక్టర్ శైలజ.**

**క్యాన్సర్ ను ప్రాథమిక దశలో గుర్తించడానికి స్క్రీనింగ్ పరీక్షలు అవసరం: డాక్టర్ రవి కృష్ణ.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 06:**
భారతీయ వైద్య సంఘం నంద్యాల శాఖ మహిళా వైద్య విభాగం ఆధ్వర్యంలో సర్వైకల్ క్యాన్సర్ ( గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్) ను ప్రాథమిక దశలో గుర్తించడం కోసం ప్రత్యేక స్క్రీనింగ్ పరీక్ష శిబిరాలు మంగళవారం నుండి వారం రోజులపాటు నంద్యాలలో అన్ని స్త్రీ వ్యాధి నిపుణుల ఆసుపత్రులలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం సాయి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న జాబిల్లి ఆసుపత్రి లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో నంద్యాల మహిళా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి, కార్యదర్శులు డాక్టర్ సునీత, డాక్టర్ శైలజ లాంచనంగా రిబ్బన్ కత్తిరించి శిబిరాలు ప్రారంభించారు.

డాక్టర్ మాధవి, డాక్టర్ సునీత, డాక్టర్ శైలజ, ఐఎంఏ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ లక్ష్మి సౌజన్య, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలు డాక్టర్ వసుధ మాట్లాడుతూ గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ను ప్రాథమిక దశలో గుర్తించడానికి అవసరమైన పాప్ స్మియర్ పరీక్షలు, హెచ్.పి.వి. డిఎన్ఏ పరీక్షలు 30 సంవత్సరాలు దాటిన మహిళలందరికీ నిర్వహించడం కోసం ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామని, కొన్ని పరీక్షలు అందరికీ ఉచితంగా, కొన్ని పరీక్షలు స్తోమత ఉన్న వారికి రాయితీతో, పేదలకు ఉచితంగా వారం రోజులపాటు నంద్యాలలో ఉన్న అన్ని స్త్రీ వ్యాధి నిపుణుల ఆసుపత్రులలో చేస్తున్నామని తెలిపారు.

ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ క్యాన్సర్ ప్రాథమిక దశలో గుర్తించడానికి స్క్రీనింగ్ పరీక్షలు చాలా కీలకమని అన్నారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిస్థాయిలో నయం చేయడానికి ఆస్కారం ఉంటుందని, ఎన్టీఆర్ వైద్య సేవలో క్యాన్సర్ ఆసుపత్రుల్లో ఈ చికిత్సలు ఉచితంగా చేస్తారని అన్నారు. మంత్రి ఫరూక్ గతంలో ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న సమయంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో మంజూరు చేసిన స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రి ఇప్పుడు ప్రజలకు అందుబాటులో ఉందని తెలిపారు. నంద్యాల మహిళా వైద్యులు ఏర్పాటు చేసిన ఈ పరీక్ష శిబిరాలలో పరీక్షలు చేయించుకోవల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి,డాక్టర్ అనిల్ కుమార్ ,డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ వసుధ, డాక్టర్ హరిత,ఐఎంఏ నంద్యాల పూర్వ అధ్యక్షులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ మధుసూదన రావు, డాక్టర్ వినోద్, డాక్టర్ జఫ్రుల్లా, వైద్యులు డాక్టర్ పెసల అశోక్, డాక్టర్ పాండురంగారావు, డాక్టర్ నీలా ప్రసాద్ ,మహిళా వైద్య విభాగం పూర్వ అధ్యక్షులు డాక్టర్ నర్మద, డాక్టర్ కల్పన, డాక్టర్ అరుణకుమారి, అకడమిక్ విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మల్లీశ్వరి,కార్యదర్శి డాక్టర్ లలిత పాల్గొన్నారు.

# చీకట్లో మగ్గుతున్న గ్రామం.





**ఆంధ్ర ప్రగతి మహానంది జనవరి 06:**
మహానంది మండలంలోని బొల్లవరం గ్రామం గత కొన్ని రోజుల నుంచి చీకట్లో మగ్గుతుంది. వీధిలైట్లు వెలగక గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు గ్రామంలోని ప్రధాన త్రాగునీటి ట్యాంకు కు నీటిని సరఫరా చేసే లైను దెబ్బ తినడంతో నీరు వృధా అవుతుంది . నీరు పంపింగ్ అనంతరం అక్కడ నిలిచిపోయిన మురుగు నీరు మరల పైప్ లైన్ లోనికి పోతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తిరిగి ఆ మురుగు నీరు పంపిన జరిగినప్పుడు ట్యాంకులోనికి వెళ్లి అక్కడినుండి కుళాయిలకు సరఫరా అవుతుంది అని వాపోతున్నారు. అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే చోట లీకేజీ ఏర్పడిన మరమ్మత్తులు చేపట్టారని కానీ ప్రస్తుతం గ్రామాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల అయినా కూడా వీధిలైట్లు, తాగునీటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

# వడ్డే ఓబన్న జయంతి వేడుకలకు మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు ఆహ్వానం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 06:**నంద్యాల జిల్లా కేంద్రంలో ఈనెల 11వ తేదీ ఆదివారం ఉదయం 10:30కు కలెక్టర్ ఆఫీస్ ఆడిటోరియంలో నిర్వహించ తలపెట్టిన స్వాతంత్ర్య సమరయోధుడు, రేనాటి యుద్ధ వీరుడు వడ్డె ఓబన్న జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేయవలసిందిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని మంగళవారం నాడు నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కమిటీ సభ్యులు మాజీ కౌన్సిలర్ పిసి వెంకటసుబ్బయ్య, వడ్డే జనార్ధన్, మంజుల సుబ్బరాయుడు, వడ్డే శీను, వడ్డే చక్రధర్, సంపంగి జయకృష్ణ, శిల్పి సుబ్బరాయుడు, నాగేంద్ర సంపంగి శీను, శంకర్ ఆహ్వాన పత్రిక ఇచ్చి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ బ్రిటిష్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తొలితరం యోధుడు వడ్డె ఓబన్న అని, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యాధిపతిగా ఆయన చూపిన ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

# డీలర్లకు యూరియా సమానంగా పంపిణీ చేయాలి.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 06:**
నంద్యాల పట్టణంలో హెూల్సేల్ డీలర్లు,రిటైల్ డీలర్లకు యూరియా సక్రమంగా పంపిణీ చేయాలని వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి, నంద్యాల వారు నున్నా వెంకటేశ్వర్లు ఆధ్వర్యములో నంద్యాల జిల్లా లోని హెూల్ సేల్ డీలర్లకు , ఎరువుల కంపెనీల సేల్స్ మేనేజర్ లకు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఎరువుల కంపెనీలు ఎరువులను అలాట్మెంట్ చేసేటప్పుడు ప్రతి హెూల్ సేల్ డీలర్లను మరియు కంపెనీ నుండి ఫామ్ ఓ వున్న డీలర్లకు అందరికీ సమానంగా అలాట్ చేయాలని కంపెనీ సేల్స్ మేనేజర్ లకు తెలియజేయడం జరిగినది.అలాగే హెూల్ సేల్ డీలర్లు రిటైల్ డీలర్లకు ఎరువులు ఇచ్చేటప్పుడు ఇతర ఎరువులను కచ్చితంగా తీసుకోవాలని కానీ, అధిక ధరలకు ఇవ్వడం కానీ చేస్తే వారిపై ఎఫ్ సి ఓ 1985 ప్రకారము చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.తరువాత ఎరువుల వాగన్ వచ్చేటప్పుడు 2-3 రోజుల ముందుగానే ముందస్తు ఎరువుల పంపిణీ ప్రణాళిక ని సమర్పించాలని, ఎరువుల వాగన్ వచ్చిన వెంటనే సమాచారము ఇవ్వాలని, ఎరువుల వాస్తవ పంపిణీ రిపోర్ట్ వాగన్ వచ్చిన 1-2 రోజులలో సమర్పించాలని తెలియజేయడం జరిగినది. జనవరి నెలకు అవసరమైన యూరియాను కంపెని ప్రతినిధులు వారి కేటాయింపులకు అనుగుణంగా జిల్లాకు త్వరతగతిన తెప్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అదేవిధంగా జిల్లాలోని డీలర్లు అందరూ యూరియా నిల్వలు రోజు ప్రభుత్వం వారిచే రూపొందించిన బోర్డు నందు అప్డేట్ చేసి రైతులకు ఎమ్మార్పీ ధర కంటే విక్రయించారాదని హెచ్చరించడం జరిగింది.
ఈ కార్యక్రమములో జిల్లాలోని సహాయ వ్యవసాయ సంచాలకులు సుధాకర్, గిరీష్, విజయ శేఖర్, వ్యవసాయ అధికారులు ప్రసాద రావు కళ్యాణ్ కుమార్ హెూల్ సేల్ డీలర్లు, కంపెనీల సేల్స్ ఆఫీసర్స్ లు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లా చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 06:** ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ సంక్షమ సమైక్య మరియు నంద్యాల జిల్లా మెగాస్టార్ చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సంక్రాతి పండుగను పురస్కరించుకుని సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించదలిచాము నంద్యాలలోని చాంద్‌బడా నందు గల మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ నందు 10-1-26 తేదిన శనివారము ఉదయం 10 నుండి 12 గంటల వరకు. ఈ ముగ్గుల పోటీల కార్యక్రమ జరుగును ముందుగా 9160654801 నెంబర్‌కు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే ఈ ముగ్గుల పోటీలో పాల్గొనే అవకాశం కలదు అని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షమ సమైక్య రాష్ట్ర కార్యదర్శి నగరడొణ సుధీర్ తెలియజేశారు. ముగ్గుల పోటీలలో పాల్గొని ఆకర్షణీయమైన ముగ్గులు వేసిన వారిలో 5 మంది మహిళలకు ఆకర్షనీయమైన బహుమతులతొ పాటు 100 మందికి చిరంజీవి సినిమా మన శంకర వర ప్రసాద్ విడుదల రోజున సాయంత్రం 6 గంటల ఆటకు 100 ట్కిట్లను ప్రోత్సాహ బహుమతిగా అందజేయనున్నట్లు 36 వార్డ్ ఇంచార్జ్ మారుతి ప్రసాద్ మరియు నంద్యాల పట్టణ చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీ లక్ష్మకాంత్,పసుపులేటి ప్రసాద్, యాదవల్ల విశ్వనాథ,రెడ్‌రొస్ కృష్ణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ శర్మ,బాలగంగాధర్ శాస్త్రి,రాజశేఖర్,నవీన్, వీనా,ప్రశాంతి,మల్లికా, పావని, స్వర్ణలత,రాఘవేంద్ర రెడ్డి హరి మద్దిలేటి, నందాలాల్ తదితరులు పాల్గొన్నారు.

# కానాలగ్రామంలో ప్రారంభమైన తి.తి.దే ధార్మిక కార్యక్రమాలు.





**ఆంధ్ర ప్రగతి సంజామల జనవరి 06:**
సంజామల మండలం, కానాల గ్రామంలోని శ్రీ శివరామాలయం నందు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఐదు రోజుల ధార్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం శ్రీమద్రామాయణం గురించి ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్య తృప్తదాస్ చేసిన ధార్మిక ప్రవచనం, స్థానిక భజన మండలి చేసిన భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించినవి. ఈ కార్యక్రమాలు శనివారం వరకు ప్రతిరోజు సాయంత్రం ధార్మిక ప్రవచనాలు మరియు స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారమండలి సభ్యులు పులి గోవర్ధన్ రెడ్డి, భజన మండలి సభ్యులు ముడియం కృష్ణుడు, ఎద్దుల రామకృష్ణుడు, బయటపాటి తిరుపాలు, బొడ్డుమీద నాగన్న, బత్తుల బాలతిమ్మయ్య, గడ్డం రాజా, తలారి మురళి, ధన్నవాడ రామాంజనేయులు, మహానందిగారి శివరామ స్వామి, చెన్నంపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# చక్రధర్ చౌదరి మృతి బాధ కలిగించింది.

**- బిసి రాజారెడ్డి**



**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె జనవరి 06:**బంగారు భవిష్యత్తు ఉన్న చక్రధర్ చౌదరి చిన్న వయసులోనే ఆకస్మికంగా మృతి చెందారన్న వార్త తనకు బాధ కలిగించిందని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అన్నారు. బనగానపల్లె మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు కమ్మ శివ శంకర్ చిన్న కుమారుడు చక్రధర్ చౌదరి ఈనెల 2వ తేదీ ప్రమాదవశాత్తు బిల్డింగ్ పై నుంచి కింద పడి చనిపోయారు. ఆ సమయంలో బిసి రాజారెడ్డి బనగానపల్లెలో అందుబాటులో లేరు. విషయం తెలుసుకొని మంగళవారం ఉదయం రామకృష్ణాపురం గ్రామానికి వెళ్లి శివశంకర్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఎంబీఏ పూర్తి చేసి, గ్రూప్స్ కోసం ప్రిపేర్ అవుతున్న, 22 సంవత్సరాల చక్రధర్ అకాల మృతి కుటుంబ సభ్యులకు ఎంతో తీరని లోటని, కుటుంబ సభ్యులందరూ చింత చెందకుండా మనోధైర్యంగా ఉండాలని సూచించారు.

# రెవెన్యూ అంశాలపై రాష్ట్ర స్థాయి వీడియో కాన్ఫరెన్స్.

**రీ సర్వే సమస్యల పరిష్కారంతో ప్రజలకు మెరుగైన సేవలు - జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జనవరి 06:**
రీ సర్వే సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించి ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శక సేవలు అందిస్తామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలోని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి రెవెన్యూ క్లినిక్స్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టం – పీజీఆర్ఎస్), రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్, మ్యుటేషన్లు, ల్యాండ్ క్లాసిఫికేషన్, జీరో నంబర్ ఖాతాలు, జీరో ఎక్స్టెంట్ ఖాతాలు, జాయింట్ ఎల్పిఎంలు, రీ సర్వే, వెబ్ల్యాండ్ పోర్టింగ్, వాటర్ ట్యాక్స్ తదితర కీలక రెవెన్యూ అంశాలపై జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీసీఎల్ఏ & స్పెషల్ సీఎస్ జయలక్ష్మితో కలిసి ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ (రెవెన్యూ) సాయిప్రసాద్ అధ్యక్షత వహించారు.నంద్యాల జిల్లా నుంచి కలెక్టరేట్లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ తదితర అధికారులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, రీ సర్వేకు సంబంధించిన సమస్యలను దశలవారీగా పరిష్కరించి, ప్రజలకు మరింత సానుకూల దృక్పథంతో వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రెవెన్యూ సేవల నాణ్యతను మెరుగుపరచడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిసిన హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ బాషా.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 06:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ని రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ హాజీ షేక్ హసన్ బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం నంద్యాలలోని మంత్రి కార్యాలయం నందు ఈ భేటీ జరిగింది.ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ హసన్ బాషా గారికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల సంక్షేమం, రాబోయే హజ్ యాత్ర ఏర్పాట్లు మరియు హజ్ కమిటీ ద్వారా యాత్రికులకు కల్పించాల్సిన సౌకర్యాల గురించి ఈ సందర్భంగా చర్చించారు ముస్లిం మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, హజ్ యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి ఫరూక్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్మార్ట్ మైక్రో ఇరిగేషన్‌తో ఉద్యాన రైతుకు లాభం

**ఆటోమేషన్‌ను ప్రారంభించిన మంత్రి అచ్చెన్న**

**అమరావతి, జనవరి 6ఆంధ్ర ప్రగతి**



వాతావరణ మార్పులు, నీటి వనరుల తగ్గుదల, సాగు ఖర్చుల పెరుగుదల వంటి సవాళ్లను అధిగమించి, సుస్థిర వ్యవసాయానికి సాంకేతికతను రైతులు విరివిగా వినియోగించాలని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. మంగళవారం విజయవాడలోని రైతు శిక్షణ కేంద్రంలో మైక్రో ఇరిగేషన్‌లో ఆటోమేషన్ విధానాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... "ఉద్యాన పంటలకు వాడే మైక్రో ఇరిగేషన్‌లో ఆటోమేషన్ గేమ్ చేంజర్ అవుతుంది. ఇప్పటికే ఉన్న డ్రిప్ ఇరిగేషన్‌కు ఆటోమేషన్ అమర్చుకుంటే.. 20-30% నీరు ఆదా కావడంతో పాటు కూలీల ఖర్చు, విద్యుత్ వినియోగం తగ్గుతుంది. పంట నాణ్యత, దిగుబడి పెరుగుతుంది" అని చెప్పారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, ఏపీఎంఐపీ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు.

# శ్రీశైలం పాదయాత్రపై

**ఫారెస్ట్ అధికారుల తాత్కాలిక ఆంక్షలు.**

**ఆత్మకూర్ ప్రాజెక్ట్ టైగర్ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అపోవ.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా, జనవరి 06:**
భారతదేశంలోని అన్ని టైగర్ రిజర్వ్ ప్రాంతాలలో ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే అఖిల భారత పులుల గణన కార్యక్రమాన్ని 2026 సంవత్సరానికి గాను నాగార్జునసాగర్ – శైలం టైగర్ రిజర్వ్ పరిధిలో చేపట్టినట్లు ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అపోవ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాతీయ స్థాయి కార్యక్రమంలో భాగంగా, నాగార్జునసాగర్ఉశ్రీశైలం టైగర్ రిజర్వ్ లోని ఆత్మకూరు డివిజన్ పరిధిలో ఫేజ్–III (Phase–III) దశలో కెమెరా ట్రాప్‌ల ద్వారా పులుల గణన పనులు ప్రారంభించినట్లు తెలిపారు. బ్లాక్ఉ1 పరిధిలోని ఆత్మకూరు, నాగలూటి మరియు శ్రీశైలం రేంజ్‌లలో ఈ గణన పనులు ఫిబ్రవరి 13వ తేదీ వరకు కొనసాగనున్నాయని పేర్కొన్నారు. అఖిల భారత పులుల గణన కార్యక్రమం జాతీయ ప్రాముఖ్యత కలిగినదైనందున, అలాగే శాస్త్రీయ గణన ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు, వెంకటాపురం నుండి హటకేశ్వరం వరకు పెచ్చరువు – నాగలూటి మార్గం గుండా పాదయాత్రను ఫిబ్రవరి 8వ తేదీ వరకు నిర్వహించవద్దని భక్తులకు సూచించినట్లు తెలిపారు. ఈ కాలంలో భక్తులు దోర్నాల రోడ్డు మార్గం ద్వారా ప్రయాణించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. అయితే మహాశివరాత్రి పర్వదినాలను దృష్టిలో ఉంచుకొని, ఫిబ్రవరి 8 నుండి 15 వరకు వెంకటాపురం నుండి హటకేశ్వరం వరకు పెచ్చెరువు – నాగలూటి మార్గం గుండా పాదయాత్రకు అనుమతి ఇవ్వబడుతుందని డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. కావున, పాదయాత్ర చేయదలచిన భక్తులందరూ పై సమాచారాన్ని గమనించి, అఖిల భారత పులుల గణన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అటవీ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

# 8న పోతిరెడ్డిపాడును సందర్శించనున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య.

**-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి పర్యటనను విజయవంతం చేయండి.**
**- రైతులకు పిలుపునిచ్చిన సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 06:**
ఈ నెల 8వ తేదీన పోతిరెడ్డిపాడును సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య సందర్శించనున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయండని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు రైతులకు పిలుపునిచ్చారు. నంద్యాల సిపిఐ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలోఎన్. రంగనాయుడు మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాయలసీమ ఎత్తిపోతుల పథకాన్ని తానే ఆపివేయడం జరిగిందని స్పష్టమైన ప్రకటన చేశారని పేర్కొన్నారు. రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని గత కొంత కాలంగా సిపిఐ పార్టీ తరఫున పోరాడుతున్నామన్నారు. చంద్రబాబు ఈ ప్రాంతవాసి అయి ఉండి కూడా తెలంగాణ ప్రాజెక్టులకు మేలు చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ నెల 8వ తేదీ గురువారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు రామాంజనేయులు, రామచంద్రయ్య, రాయలసీమ జిల్లాల పరిధిలోని సిపిఐ జిల్లా కార్యదర్శులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన వివరించారు. పోతిరెడ్డిపాడు విస్తరణ పూర్తయితే ముచ్చుమర్రి, నిప్పుల వాగు, గండికోట రిజర్వాయర్, బ్రహ్మసాగర్ ప్రాజెక్టులకు నీరు అందుతుందని రంగనాయుడు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, సిపిఐ సీనియర్ నాయకులు సంజీవులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) క్యాలెండర్ ను ఆవిష్కరించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 06:**
రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) నూతన 2026 క్యాలెండర్ ను రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ఈరోజు నంద్యాల క్యాంపు కార్యాలయం నందు ఆవిష్కరించడం జరిగింది మరియు వెలుగోడు మండల లో 30 వేలకు పైగా మైనార్టీ పాపులేషన్ కలదు అని ఆ ప్రాంతంలో ఉర్దూ మీడియం జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని సంఘం తరపున ఒక వినతిపత్రం ఇవ్వడం జరిగింది అక్కడ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేస్తే పదోతరగతి తర్వాత డ్రాప్ అవుట్ సంఖ్య తగ్గించి ముస్లిం విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి వీలు ఉంటుందని మంత్రి ఫరూక్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది మంత్రి ఫరూక్ సానుకూలంగా స్పందించారు ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుళ్లి అక్కడ కాలేజ్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.
ఈ కార్యక్రమంలో ఉర్దూ డిఐ అసముద్దీన్, రూట నంద్యాల జిల్లా అధ్యక్షులు సైఫుల్ల, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ దస్తగిరి బాషా ,రాష్ట్ర మరియు ఆల్మండ్ నాయకులు జానీ బాషా, యూనుస్ బాషా, అఫ్జల్ బాషా,నూరుల్లా, మస్తాన్వలి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# 'కాఫీ విత్ కార్యకర్త ' కార్యక్రమం తో జనసైనికులల్లో నూతన ఉత్సాహం.!

**కాఫీ విత్ కార్యకర్త 'కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా కొణిదల సునీల్.**

**జన సైనికులకు దిశా నిర్దేశం చేసిన ముఖ్య జనసేన నాయకులు.**

**జిల్లా కమిటీ ఏర్పాటుతో జనసేన బలపడుతుందంటున్న జనసైనికులు.**

**నంద్యాల జిల్లాలో మారాసు గురు బాబు నాయకత్వంలో నడుస్తామంటున్న కార్యకర్తలు.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 06:**
నంద్యాల జిల్లా కేంద్రంలో జనవరి 4వ తేదీన ఆదివారం పట్టణంలోని పద్మావతి నగర్ నందలి బి 9 ఫంక్షన్ హాల్ లో జనసేన నాయకులు మారాసు గురుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన 'కాఫీ విత్ కార్యకర్త 'కార్యక్రమం నందు సుమారు 250 కి పైగా జన సైనికులు పాల్గొనడంతో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా విచ్చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గసన్నిహితులు కొణిదెల సునీల్ ప్రత్యేక ఆకర్షణగా ఈ కార్యక్రమంలో నిలిచారు. నంద్యాల జనసేన నాయకులు భవనాసి వాసు, దండు మురళీకృష్ణ ,ఆళ్లగడ్డ జనసేన నాయకులు ఇరుగెల నారాయణరెడ్డి, జున్ను ప్రసాద్, నందికొట్కూరు రాము, వీర మహిళల సంఘం నాయకురాలు జయంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ కు జనసైనికులు అంటే ప్రాణమని వారి శ్రేయస్సు కోసం ఏ పార్టీ చేయని విధంగా సొంత నిధులతో కార్యకర్తల కోసం నిధులు కేటాయిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ సూచనల మేరకు కార్యకర్తలు ఎంతో సర్దుకుపోతున్నారని కచ్చితంగా పార్టీ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకున్న ప్రతి జన సైనికుడికి మంచి భవిష్యత్తు ఉంటుందని దిశా నిర్దేశం చేశారు. అనంతరం కార్యకర్తలు మాట్లాడుతూ అతి త్వరగా జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తే నూతన నాయకత్వంలో బలపడిన జనసేన పార్టీకి రానున్న భవిష్యత్తులో తిరుగుండదని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో అధికార పార్టీలకు లేనివిధంగా నిజమైన కార్యకర్తలు జనసేన పార్టీకి ఉన్నారన్నారు. జిల్లా కమిటీలు లేనందున సరైన నాయకత్వం లేక జనసైనికులు డీలపడుతున్నారని తమ ఆవేదనను వెళ్ళగక్కారు. నంద్యాల జిల్లాలో పార్టీ ఆవిర్భావం నుండి జన సైనికునిగా కష్టపడుతున్న మారాసు గురు బాబు నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని సభాముఖంగా పేర్కొన్నారు.కార్యక్రమం ముగిసిన అనంతరం కార్యకర్తలు కొణిదల సునీల్ తో ఫోటోలు దిగడానికి ఉత్సాహంగా పోటీలు పడ్డారు.కాఫీ విత్ కార్యకర్త ' కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా, చక్కగా నిర్వహించినందుకు మారాసు గురు బాబుకు కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలతో ముఖ్య నాయకులతో చర్చించడం కార్యకర్తలలో మనోధైర్యం ఏర్పడుతుందని, ఇంకా ఉత్సాహంగా పనిచేసేందుకు అవకాశం ఉంటుందని కార్యకర్తలు అందరూ చర్చించుకోవడం విశేషం.